శివలింగ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం

శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పూజలు చేస్తున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 1 : మండలంలోని నెమ్లి షిర్డి సాయిబాబా ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన పంచముఖి పరమ శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో సోమవారం మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారాన్ని ఆలయ ధర్మకర్త పట్లోళ్ల మోహన్‌రెడ్డి సన్మానించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, నాయకులు రాము, మల్లేశ్ తదితరలు ఉన్నారు.

బీఆర్ఎస్ నుంచి ఒకరి సస్పెన్షన్

మాచారెడ్డి, ఏప్రిల్ 1 : బీఆర్ఎస్ పార్టీ నుంచి సీనియర్ నాయకుడు రావుల ప్రభాకర్‌ను సస్పెండ్ చేసినట్లు మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం తెలిపారు. ప్రభాకర్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ సోషల్ మీడియాలో పార్టీ ప్రతిష్టకు భంగం కల్గించేలా పోస్టులు పెడుతున్నాడని కామారెడ్డి ఎన్నికల ఇన్‌చార్జి గంపగోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ ఆదేశాల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ప్రభాకర్‌కు బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

ఎన్నికల చట్టాలు, నిబంధనలపై అవగాహన ఉండాలి

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఏప్రిల్ 1 : ఎన్నికల చట్టాలు, నిబంధనలపై అధికారులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణకు కలెక్టర్ హాజరై మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రిసైడింగ్ అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను తమ నియోజకవర్గంలో నుంచి తప్పనిసరిగా పొందాలని సూచించారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందించేలా ఫారం-12ను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో మే 4 నుంచి 8వ తేదీ వరకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు స్వీకరిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి సంబంధించిన వివరాలను 11 సీలో పొందుపర్చాలని చెప్పారు. ఫారం 12 పోస్టల్ బ్యాలెట్ అందని వారు సంబంధిత ఏఆర్‌వోకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈవీఎం, వీవీ ప్యాట్, డ్రాఫ్ట్ బాక్స్ నుంచి మాక్ పోల్ స్లిప్పులను తీసివేయడం, వీవీ ప్యాట్ మాక్‌పోల్ పింక్ పేపర్ స్లిప్పులను వెనుక స్టాంప్ చేసిన తర్వాత నలుపు కవర్లో సీల్ చేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న టెక్నికల్ అధికారులు, ఆర్డీవో రాథోడ్ రమేశ్

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై శిక్షణ

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 1 : మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈవీఎంల పనితీరు, వీవీ ప్యాట్‌ల నిర్వహణపై పీవోలకు, ఏపీవోలకు వివరించారు. శిక్షణ తరగతులను ఆర్డీవో రాథోడ్ రమేశ్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణలో పీవోలు, ఏపీవోల పాత్ర కీలకమని అన్నారు. ఏవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు తక్షణమే సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా యోగా వార్షికోత్సవం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యోగా గురువులు

కామారెడ్డి, ఏప్రిల్ 1 : జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం యోగా కేంద్రంలో సోమవారం సీనియర్ సిటిజన్ ఫోరం యోగా 5వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు గడ్డం రాంరెడ్డి, గరిపల్లి అంజయ్య గుప్తా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల నుంచి సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో చాలా మందికి యోగా నేర్పించామన్నారు. కార్యక్రమంలో యోగా గురువు రాంచంద్రం, అంజయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్, ఏప్రిల్ 1 : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిందని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి డెబిట్, క్రెడిట్ కార్డులను అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చిందని ప్రాసెసింగ్ ఫీజ్ కోసం కొన్ని డబ్బులు పంపాలని అడుగుతారని, వారి మాటలు నమ్మవద్దని తెలిపారు. సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

మెడికల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 1 : బాన్సువాడ మాతా శిశు, ఏరియా దవాఖానలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల ఐదు నెలలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను మెడికల్ కమిషనర్ మంజూరు చేయడంతో వారు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను గుర్తించి స్పందించిన మెడికల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ కార్మికులకు రావాల్సిన జీతాలను వారి అకౌంట్‌లో జమ చేయాలని ఆయన కోరారు. సంతోష్, రేణుక, ఖమ్రురుద్దీన్, సంగీత, సుశీల, గంగాధర్, కళ్యాణి, ధనుంజయ్, గంగారాం, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొలతల సేకరణ

కామారెడ్డి, ఏప్రిల్ 1 : కామారెడ్డి పట్టణంలోని 49 వార్డులలో మంగళవారం నివాస గృహం, నివాసేతర గృహాలు, వృత్తి వ్యాపార లైసెన్స్ కొలతలు తీసుకోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నివాస గృహం, నివాసేతర గృహాల దస్తావేజులు, బిల్డింగ్ పర్మిషన్ జిరాక్స్ పత్రాలను తమ వార్డు అధికారులకు అందజేయాలని సూచించారు. దీనికి కామారెడ్డి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

■ అదనపు కలెక్టర్ చంద్రమోహన్

బస్వాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

గుండారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

భిక్కనూర్, ఏప్రిల్ 1 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీఏ అపర్ణ, మండల వ్యవసాయ అధికారి రాధ, సీఈవో మహేశ్వరి, క్లస్టర్ ఆఫీసర్ రమేశ్, మానిటరింగ్ అధికారి సాయిలు, ఏఈవోలు ఆనంద్, వినోద్, రైతులు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజంపేట్, ఏప్రిల్ 1 : మండలంలోని ఆర్గొండ సొసైటీ పరిధిలోని ఎల్లారెడ్డిపల్లి, గుండారం, సిద్దాపూర్ గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాల్‌కు ఏ గ్రేడ్‌కి రూ.2,203, బీ గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో మానిక, సొసైటీ సీఈవో సాయిలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ప్రారంభం

కామారెడ్డి, ఏప్రిల్ 1 : కామారెడ్డి జిల్లాలో 83 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా కంట్రోల్ రూమ్ నంబర్ 08468-220051కు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 348 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో 326, ఐకేపీ ఆధ్వర్యంలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంకా 265 కొనుగోలు కేంద్రాలు వారం రోజుల వ్యవధిలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

దెబ్బ తిన్న పంట వివరాల సేకరణ

దోమకొండ, ఏప్రిల్ 1 : గత నెలలో కురిసిన వడగండ్ల వాన కారణంగా దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం దోమకొండ శివారులో నష్టపోయిన వరి పంటను ఏఈవో కృష్ణారెడ్డి పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నష్ట పోయిన పంట వివరాలను సేకరించి అధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

ఆస్తి కోసం అన్నదమ్ముల మధ్య పరస్పర దాడి

దోమకొండ, ఏప్రిల్ 1 : మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన శ్రీకాంత్, దేవరాజు సోమవారం ఒకరిపై ఒకరు పరస్పరం దాడులకు పాల్పడినట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్య చారి తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్, దేవరాజు ఇద్దరు అన్నదమ్ముల పిల్లలు. ఉమ్మడి ఆస్తిగా ఉన్న 24 గుంటల వ్యవసాయ భూమి విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలిపారు. వృతిరీత్యా మంగళి అయిన దేవరాజు తన మంగళి షాపులో పని చేసుకుంటూ ఉండగా శ్రీకాంత్ రాళ్లతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ గొడవలో శ్రీకాంత్‌కు కత్తెరతో గాయమైందన్నారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీ ఆయా ఆత్మహత్య

మణెమ్మ(ఫైల్)

రామారెడ్డి, ఏప్రిల్ 1: మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త దండబోయిన మణెమ్మ(38) ఉరేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. మణెమ్మ భర్త మరో మహిళతో కొన్ని రోజులుగా మాట్లాడుతున్నాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో మనస్తాపం చెందిన మణెమ్మ సోమవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నదని ఎస్సై తెలిపారు. మృతురాలి కూతురు స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

మద్యం పట్టివేత

డోంగ్లీ, ఏప్రిల్ 1: మండలంలోని మారేపల్లి గ్రామంలో ఓ కిరాణా దుకాణంపై ఎస్సై కదిరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేశారు. దుకాణంలో నిల్వ ఉన్న రూ.3,500 విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. పోలీసు సిబ్బంది విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వద్దు

నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్

నిజాంసాగర్, ఏప్రిల్ 1: గ్రామాల్లోని హరితహారం నర్సరీల్లో మొక్కల పెంపకంపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. మహ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో ఏర్పాటుచేసిన నర్సరీని సోమవారం ఆయన పరిశీలించారు. ముందుగా గ్రామంలో పర్యటించారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా తీరును పరిశీలించారు. పన్ను వసూలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. నర్సరీలో పదివేల మొక్కలను హరితహారంలో నాటేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఒక్క మొక్క కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి రవీందర్ ఉన్నారు.

దొరికిన సెల్‌ఫోన్‌ను అందజేసిన వ్యక్తికి సన్మానం

అంజాగౌడ్‌ను సన్మానిస్తున్న ఎస్సై ఆంజనేయులు

గాంధారి, ఏప్రిల్ 1: మండల కేంద్రానికి చెందిన అంజాగౌడ్‌కు సోమవారం రోడ్డుపై ఒక సెల్‌ఫోన్ దొరికింది. దానిని అతడు పోలీసులకు అందజేశాడు. నిజాయితీగా సెల్‌ఫోన్‌ను అందజేసిన అతడికి ఎస్సై ఆంజనేయులు శాలువా కప్పి సత్కరించారు. సెల్‌ఫోన్ గౌరారం గ్రామానికి చెందిన వ్యక్తికి సంబంధించినది అని గుర్తించి అతడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల శ్రీనివాస్, తూర్పు రాజులు, వెంకటి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి తాగునీటిని సరఫరా చేయాలి

■ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, అధికారులు

మాట్లాడుతున్న సీఎస్ శాంతి కుమారి

కామారెడ్డి, ఏప్రిల్ 1 : ప్రతి గ్రామానికి పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని, ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి వేసవి తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీటి సరఫరా నిమిత్తం మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. గ్రామస్థాయి ప్రత్యేకాధికారులను నియమించాలని కలెక్టర్లకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటర్లను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో అవసరమైన మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలన్నారు. కొనుగోలు కేంద్రంలేని కారణంగా రైతులు ప్రైవేట్‌కు తక్కువ ధరకు ధాన్యం విక్రయిస్తున్నారనే మాట రావొద్దని సీఎస్ స్పష్టం చేశారు. రాబోయే నాలుగు రోజుల్లో 7,149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని అన్నారు. వడగాల్పులు వస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 83 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. 265 కేంద్రాలు నాలుగు రోజుల్లో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఈవో రాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్, జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇండ్లు, దుకాణాల్లో తనిఖీలు

గాంధారి, ఏప్రిల్ 1: మండల కేంద్రంలో అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న పలువురి ఇండ్లు, దుకాణాల్లో పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టారు. సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, గాంధారి ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో పలువురి ఇండ్లు, దుకాణాలతోపాటు ఫైనాన్స్ కార్యాలయాలను తనిఖీ చేశారు. విలువైన పత్రాలు, ప్రామిసరీ నోట్లు, బాండు పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. గోపాల్‌రావు, రవీందర్‌గౌడ్, సంతోష్ అనే ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహించడం నేరమని, అధిక వడ్డీ వసూలు చేసే వారి వివరాలు తమకు అందజేయాలని కోరారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.



గాంధారిలోని ఓ దుకాణంలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, SYED MUNAWAR S/o. SYED MOHAMMED ALI R/o. H.No.1-14-17, Indra nagar Colony, Noor masjid, Kamareddy, TS Change my name as SYED MUNWAR S/o. SYED MOHAMMED ALI
NTZ-324762

CHANGE OF NAME

★I, MOHAMED ALI S/o. SYED KAJA MIYA R/o. H.No.4-8-5, Islampura, Kamareddy. T.S Changed My New Name as SYED MOHAMMED ALI S/o. SYED KAJA MIYA
NTZ-324763

CHANGE OF NAME

★I'm PODDUTURI MANASA, W/o. Podduturi Charan Reddy, R/o. 1-1-65/1, Armoor, Nizamabad District, TS. Changed My Name as PODDUTURI MANASA REDDY, W/o. Podduturi Charan Reddy.
NT-311778

CHANGE OF NAME

★I'm KANDARAPU GANGAMANI, W/o. Kandarapu Ramesh, R/o. 11-29, Balkonda, Nizamabad District, TS. Changed My Name as KANDARAPU GANGU, W/o. Kandarapu Ramesh.
NT-311778

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సదాశివనగర్, ఏప్రిల్ 1: జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సదాశివనగర్ ఎస్‌హెచ్‌వో కాజల్(ఐపీఎస్) అన్నారు. మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును ఆయన సోమవారం తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేసే సిబ్బందికి వాహనదారులు సహకరించాలన్నారు. నిబంధనల ప్రకారం రూ.50వేలకు మించి డబ్బులను వెంట తీసుకెళ్లరాదని, ఎక్కువ డబ్బులు ఉంటే అందుకు సంబంధించిన పత్రాలను ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

3న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 1: లింగంపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈనెల 3వ తేదీన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ గణేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా, వినియోగం తదితర సమస్యలకు సంబంధించి వేదిక ద్వారా పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు సమావేశంలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు

మైక్ ద్వారా ప్రచారం చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు

నిజాంసాగర్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నదని, ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు హెచ్చరించారు. నిజాంసాగర్, పిట్లం మండలాలకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ నంబర్-3 సభ్యులు ఏఎస్సై రాజేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ శ్రావణ్‌కుమార్, కానిస్టేబుల్ విజయ్ కలిసి మండలంలోని తున్కిపల్లి, బుర్గుల్, నర్వ, గాలీపూర్ గ్రామాల్లో సోమవారం మైకు ద్వారా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో మద్యం విక్రయించొద్దని, అనవసరమైన విషయాలను దృష్టిలో ఉంచుకొని అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వజ్జపల్లి తండాలో ఉపాధి పనులు ప్రారంభం

పనులను ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి

సదాశివనగర్, ఏప్రిల్ 1: మండలంలోని వజ్జపల్లి తండాలో ఉపాధి హామీ పనులను సోమవారం ప్రారంభించినట్లు పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామన్నారు. కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనిల్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ స్రవంతి దేవీసింగ్‌నాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సర్దార్ నాయక్, మెట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

మద్నూర్, ఏప్రిల్ 1: మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయిపై ఎంపీటీసీ సభ్యులు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. మద్నూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో రాథోడ్ రమేశ్ అధ్యక్షతన అవిశ్వాస తీర్మానంపై సోమవారం సమావేశాన్ని ఏర్పాటుచేశారు. సమావేశానికి సభ్యులు హాజరు కాలేదు. దీంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో ప్రకటించారు. సమావేశంలో తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

పోచారం గ్రామంలో గేదెకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 1: పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్య సిబ్బంది రవీందర్ యజమానులకు సూచించారు. మండలంలోని పోచారం గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 352 గేదెలు, 673 ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో జుక్కల్ పశువైద్యశాల సబార్డినేట్ రవి, గోపాలమిత్ర రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.